క్లుప్తంగా

ముగిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీ కాలం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పర్సన్ ఇన్‌చార్జ్ నియామకానికి జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి ప్రతిపాదనలు పంపారు. శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలోని మార్కెట్ కమిటీ పాలక వర్గం పదవీ కాలం ఈ నెల 24వ తేదీతో పూర్తి అయింది. ఎన్నికల కోడ్ ఉండటంతో పదవీ కాలాన్ని పొడిగించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ ఏడీఎంకు నివేదించారు. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపినట్లు ఏడీఎం తెలిపారు. పర్సన్ ఇన్‌చార్జ్‌గా మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులును నియమించే అవకాశం ఉంది.

ప్రతి ఆశా వద్ద మందుల కిట్

కర్నూలు(హాస్పిటల్): ఆశాలు తమ వద్ద ఎప్పుడూ మందుల కిట్‌లను నిర్వహణ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు.శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా హెచ్‌బీఎస్‌సీ డ్రగ్ కిట్‌లను ఆశాలకు డీఎంహెచ్‌ఓ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రగ్ కిట్‌లలో అమోక్సిలిన్ సిరప్‌లు 5, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు 5, జింక్ సిరప్‌లు 5, పారాసిటమాల్ సిరప్‌లు 5, పారాసిటమాల్ డ్రాప్స్ 5 బాటిల్స్ ఉంటాయన్నారు. ఈ డ్రగ్ కిట్‌లను ప్రతి ఒక్క ఆశా వద్ద ఉంచుకోవాలన్నారు. గృహ సందర్శన చేసినప్పుడు 0 నుంచి 42 రోజుల్లోపు పిల్లల్లో ఏమైనా ప్రమాదపు లక్షణాలు ఉంటే గుర్తించి వారిని మెడికల్ ఆఫీసర్ వద్దకు రెఫర్ చేయాలన్నారు. పిల్లలకు అవసరమైన ఈ డ్రగ్స్‌ను మెడికల్ ఆఫీసర్ సూచన మేరకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్‌ఓ ఇందిర, డీసీఎం ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం

కర్నూలు(సెంట్రల్): కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఎప్పుడూ ఉంటుందని ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు వి.శంకర్ అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం, సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టికెట్లు దక్కని వారికి పార్టీ పదవుల్లో తప్పక న్యాయం జరుగుతుందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేసుకుంటే కష్టాలన్నీ తీరిపోతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, ఎంపీ అభ్యర్థి పీజీ రాంపుల్లయ్య యాదవ్, డీసీసీ అధ్యక్షుడు బాబురావు పాల్గొన్నారు.

పెద్దపాడులో సీపీఎం అభ్యర్థి ప్రచారం

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం పెద్దపాడులో పాణ్యం సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శనివారం ఆయన గ్రామంలోని అన్ని ఇళ్లు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే గ్రామ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, టి.రాముడు, ఎండీ ఆనంద్‌బాబు,గురుశేఖర్ పాల్గొన్నారు.

నేడు కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపు

కర్నూలు(అగ్రికల్చర్): గృహ, వాణిజ్య విద్యుత్ బిల్లులు ఇంకా రూ.18 కోట్ల వరకు బకాయిలుగా ఉన్నాయని, వీటిని ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు, వ్యాపార, వాణిజ్య వేత్తలు వెంటనే బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. ఈ నెల 30 తేదీలోపు బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగించడం జరుగుతుందన్నారు.

ఆదరించండి..అండగా ఉంటా




కొత్త పేటలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, వైఎస్సార్‌సీపీలో చేరిన 17వ వార్డు మహిళలు

- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- 17వ వార్డులో టీడీపీ నుంచి భారీ చేరికలు

కర్నూలు (టౌన్) : ఎన్నికల్లో ఓటేసి ఆదరిస్తే అన్ని విధాలుగా అండగా నిలబడుతానని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక 17వ వార్డులోని సంజయ్ గాంధీ నగర్‌లో ఆయన పర్యటించారు. ఆ వార్డులోని టీడీపీకి చెందిన 200 కుటుంబాలు కిషోర్, రమేష్, లావణ్య, నూర్జహాన్, రామకృష్ణ, నాని ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే, పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ ఐదేళ్ల మంచి పాలన అందించిన జగన్‌మోహన్‌రెడ్డిని పేద, బడుగు, బలహీన వర్గాలు మద్దతునిచ్చి గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి నగరంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన వంద కుటుంబాలు తమ పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీలో చేరికలు ఇటీవల పెరిగాయన్నారు.

50వ వార్డులో ఎన్నికల ప్రచారం

స్థానిక 50వ వార్డు కొత్తపేటలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, స్థానిక వార్డు కార్పొరేటర్ షేక్ మహమ్మద్ ఆధ్వర్యంలో వారువార్డులో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ 2019 నుంచి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేశారన్నారు. 2024 జగనన్న మేనిఫెస్టో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. మరోసారి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2024 మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న జగనన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నవరత్నాలను వర్తింపజేయడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 60 శాతం తగ్గించి ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణ విషయంలో ప్రభుత్వం సహకారం అందించడం మంచి పరిణామమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

అర్హులైన చిన్నారులందరికీ టీకాలు వేయాలి



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అర్హులైన చిన్నారులందరికీ షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయడం వల్ల అనేక వ్యాధులను అరికట్టవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్లను సరైన ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేస్తున్నారా, రికార్డులు సరిగా నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు. ఆర్‌సీమెచ్, ఎంసీహెచ్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి షెడ్యూల్ మేరకు టీకాలు ఇవ్వాలన్నారు. టీకాలు ఇవ్వడం వల్ల పోలియో, క్షయ, కోరింత దగ్గు, కామెర్లు, అతిసారం, కంఠసర్పి, ధనుర్వాతం, నిమోనియా వంటి జబ్బులు రాకుండా నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, డీసీఎం ప్రసాద్, ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి



జెడ్పీ సీఈఓకు వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాలో జమ కాని నెలవారీ పాత కంతులను వెంటనే సమ చేయాలన్నారు. అలాగే 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించాలన్నారు. రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న ఉపాధ్యాయుల పార్ట్ ఫైనల్ బిల్స్‌ను వెంటనే చెల్లింపులకు పంపాలన్నారు. ప్రతి ఏడాది చివరిలో పూర్తి షెడ్యూల్ తమకు పంపితే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయనే విషయాన్ని సీఈఓ వివరించారు. సీఈఓను కలిసిన వారిలో సహ అధ్యక్షుడు హేమంత్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి యోహోషువ, జిల్లా కార్యదర్శి ఏటీ తిమ్మన్న, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, సీనియర్ నాయకులు మారెప్ప, హనుమంతు, కాంతారావు, జెడ్పీ పర్యవేక్షకులు సౌభాగ్యలక్ష్మి, మూర్తి తదితరులు ఉన్నారు.

మూగజీవులకు సేవలు అందించేవారు అభినందనీయులు

- జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ వెల్లడి



పదవీ విరమణ చేసిన పశువైద్యాధికారులను సత్కరిస్తున్న పశుసంవర్ధక శాఖాధికారులు రామచంద్రయ్య, శారదమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): నోరులేని మూగ జీవులకు వైద్య సేవలు అందించే పశు వైద్యులు నిజంగా అభినందనీయులని, అటువంటి వారికి సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. రైతులు బతకడానికి ఆధారమైన పశుసంపద పరిరక్షణలో పశువైద్యులు కీలక పాత్ర వహిస్తున్నారని చెప్పారు. శనివారం జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్, ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవ కార్యక్రమం కిసాన్ ఘాట్‌లోని ఫన్ అండ్ ఫుడ్ సమావేశ మందిరంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, ఏడీలు, డీడీలు హాజరైన ఈ సమావేశంలో పశువైద్యులకు వృత్తి నైపుణ్యం పెంపుపై జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

పదవీ విరమణ అధికారులకు సత్కారం

జిల్లా పశుసంవర్ధకశాఖలో ఉన్నత స్థానాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ రామచంద్రయ్య, సీవీ రమణయ్య, హమీద్‌పాషా, లక్ష్మీప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. జిల్లాకు వారు అందించిన సేవలను ప్రశంసించారు. ఇంటర్నల్‌గా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కర్నూలు, ఆదోని డీడీలు దుర్గాప్రసన్నబాబు, రమణ, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనీష్ లక్ష్మణ్, మదన్‌మోహన్, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లన్న, రవిప్రకాశ్‌రెడ్డి, ఏడీలు సుధాకర్‌రెడ్డి, ధనుంజయుడు, భవాని శంకర్‌రెడ్డి, మాధవీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: వన్‌టౌన్ మెయిన్ బజార్ ఏకాంత రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక జరిగింది. మించిన్ బజార్ రథ శాల నుంచి వన్‌టౌన్ మేడం వారి సత్రం వరకు దివ్య మంగళ రథోత్సవం జరిగింది. భక్తులు అధికంగా పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ దినేష్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, జిల్లా కార్యదర్శి మాళిగి భాను ప్రకాష్, జిల్లా సహ కార్యదర్శులు నాగరాజు, గోవిందరాజులు, గిరిబాబు, సభ్యులు చిలుకూరు ప్రభాకర్, నందకిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు రామ్మూర్తి ఆచార్య, కడప పండితులు విద్యా నిధి ఆచార్య, సత్యప్రియ, బజరంగ్ దళ్ నాయకులు నీలి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల పక్షాన పోరాడాలి



మహేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలుకల్చరల్: సమాజాన్ని మార్చగలిగే ఆయుధం కవిత్వమని, అలాంటి కవిత్వాలు రాసే కవులు బాధితుల పక్షాన నిలబడి కలం పోరు చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సమితి నాయకులు ఎస్.మహేశ్వరయ్య 3వ వర్ధంతి సభ జరిగింది. మహేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మహేశ్వరయ్య పేరుతో పురస్కారమివ్వడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ కవిగా, రచయితగా వ్యాసకర్తగా మహేశ్వరయ్య ఎనలేని సాహిత్య సేవ చేశారన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు సంఘం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్థానం జిల్లా కన్వీనర్ డి.అయ్యన్న, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు మాట్లాడుతూ కవిగా మహేశ్వరయ్య సేవలు అనిర్వచనీయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు డి.పార్వతయ్య పాల్గొన్నారు.

మరింత సంక్షేమం

- జగన్ చెప్పాడంటే చేస్తాడు
- వైఎస్సార్‌సీపీ 2024 మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం



కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన 2024 మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఐదేళ్ల వైఎస్ జగన్ ప్రజారంజక పాలన అందించారు. 2019లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి మాట ఇస్తే తప్పని నేతగా పేరుగడించారు. మనసున్న నేతగా పేదల హృదయాల్లో స్థానం దక్కించుకున్నారు. ఇప్పుడు ఆ స్థానాన్ని మరింత పదిలం చేసుకునేందుకు అన్ని వర్గాల సంకేమం, అభ్యునతే ధ్యేయంగా 2024 మేనిఫెస్టోను రూపొందించారు. గత 58 నెలలుగా ప్రతినెల 1వ తేదీనే అవ్వాతాతలకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్ అందజేశారు. ఒక్క కర్నూలు నగరంలోనే 34 వేల మందికి ప్రతి నెల రూ.9.50 కోట్లు పెన్షన్ రూపంలో అందజేస్తున్నారు. ప్రస్తుతం అవ్వాతాతలకు ఇస్తున్న రూ. 3000ను తాజా మేనిఫెస్టోలో రూ.3,500 పెంచారు. అలాగే అమ్మఒడి సాయాన్ని రూ. 15 వేల నుంచి రూ.17 వేలకు, రైతుభరోసా సాయాన్ని రూ.13500 నుంచి రూ. 16 వేలు ఇలా వివిధ పథకాల సాయాన్ని పెంచడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ చంద్రబాబులా హామీలు ఇచ్చి మోసం చేయరని చెప్పాడంటే చేస్తాడని వారు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మఒడి పెంచడం ఆనందంగా ఉంది



జగనన్న ప్రభుత్వంలో ఐదేళ్లుగా అమ్మ ఒడి సాయం అందుకుంటున్నా. ఈ ఆర్థిక సాయం ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా పిల్లల చదువులు కొనసాగుతున్నాయి. జగనన్న ప్రస్తుతం ఇస్తున్న రూ. 15 వేల సాయాన్ని రూ. 17 వేలకు పెంచడం ఆనందంగా ఉంది. మాలాంటి సామాన్య కుటుంబాలకు ఈ మొత్తం పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– చంద్రకళ, సి.క్యాంప్

మా కష్టాలు తీరుతాయి



నేను వైఎస్సార్ చేయూత లబ్ధిదారురాలిని. 2019 సంవత్సరం నుంచి ఈ పథకం కింద ప్రతి ఏడాది రూ.18,750 తీసుకుంటున్నా. ఈ మొత్తంతో నా కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నాను. 2024 మేనిఫెస్టోలో ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించడం సంతోషంగా ఉంది. మా లాంటి పేదలకు ఈ పథకం కింద అందే మొత్తం ఎంతో సాయ పడుతుంది. మమల్ని ఆదుకుంటున్న జగనన్నకు అండగా ఉంటాం.

– పూర్ణిమ, 15వ వార్డు, బుధవారపేట

వాహన డ్రైవర్ల కుటుంబానికి భరోసా



వాహనమిత్ర ద్వారా నా కుటుంబానికి జగనన్న ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. గత ఐదేళ్లలో వాహనమిత్ర పథకం ద్వారా రూ.50 వేలు వచ్చింది. తాజాగా జగనన్న మేనిఫెస్టోలో ఈ పథకాన్ని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచాడు. చాలా సంతోషం. అలాగే డ్రైవర్లకు ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు, ఆటో, ట్యాక్సీ, లారీ కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేవారికి రూ.3 లక్షలు వరకు ప్రభుత్వమే వడ్డీ చెల్లించే విధంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయం.

– బోయ మధు, శ్రీరాం నగర్

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య తదితరులు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సిట్రా సత్యనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ భగీరథుడు కఠోరమైన దీక్ష చేసి దివి నుంచి భువికి గంగను రప్పించాడన్నారు. కఠోర శ్రమ చేస్తే దేనినైనా సాధించవచ్చు అనేందుకు ఆయన ఓ ఉదాహరణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రజల కష్టాలు తీర్చేందుకు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, సీనియర్ నాయకులు గద్దం రామకృష్ణ, బత్తుల లక్ష్మీకాంతయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్, నన్నూరు బేగ్, మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎం, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల గదులను నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఆర్జీఎంలో నందికొట్కూరు, శ్రీశైలం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, ఫార్మసీ కళాశాలలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచే గదులు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిశీలించామన్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ ప్రవీస్‌కుమార్, డీఎస్పీ రవింద్రానాథ్‌రెడ్డి ఉన్నారు.

రక్తహీనతకు చెక్!

- బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో వైద్యపరీక్షలు
- రక్తహీనత ఉన్న బాలికలకు మాత్రల పంపిణీ
- ఫలితంగా తగ్గుముఖం పట్టిన అనీమియా కేసులు

కర్నూలు(హాస్పిటల్): అందరిలా ఆటలాడాలంటే చేతకాదు.. ఆడుతూ పాడుతూ పరిగెత్తాలంటే చెప్పలేని నీరసం. కాస్త నడిస్తే కళ్లు తిరగడం. ముఖమంతా పాలిపోవడం వంటి లక్షణాలతో పాఠశాలల్లో బాలికలు కనిపిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం రక్తహీనత అని గుర్తించిన ప్రభుత్వం సమస్య పరిష్కారానికి పలు చర్యలు చేపట్టింది. ఫలితంగా ప్రస్తుతం జిల్లాలో రక్తహీనత కేసులు గణనీయంగా తగ్గాయి.

కౌమారదశలోని వారిలో రక్తహీనతను గుర్తించి, సమస్యను పరిష్కరించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 10 నుంచి 19 ఏళ్ల వయస్సున్న బాలికలకు రక్తపరీక్షలు నిర్వహిస్తోంది. ఈ మేరకు మొదటి విడతలో భాగంగా 2022 డిసెంబర్ 13 నుంచి చర్యలు ప్రారంభించింది. ఐదు నెలల పాటు కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రభుత్వం జిల్లాలో 65.11 శాతం బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అనీమియా ముక్తభారత్ నిబంధనల ప్రకారం రోజుకు రెండు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రల చొప్పున మూడు నెలల పాటు బాలికలకు ఇచ్చారు. దీనిని ఆయా పాఠశాలల తరగతి గది ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ వివరాలను హెచ్‌ఎం యాప్‌లో అప్‌లోడ్ చేశారు. మాత్రలు కావాల్సి వస్తే వెంటనే ఏఎన్‌ఎంకు సమాచారం ఇచ్చి పాఠశాలలకు చేరేటట్లు చర్యలు తీసుకున్నారు. సివియర్ అనీమియా కేసులను గురించి సంబంధిత ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చి వారిచే పర్యవేక్షణ చేయించారు. అనంతరం రక్తహీనత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, మాత్రల ఆవశ్యకత గురించి సంబంధిత హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలచే అవగాహన కల్పించారు.

ప్రభుత్వ చర్యలతో తగ్గిన రక్తహీనత కేసులు

మొదటి విడతలో తీసుకున్న చర్యల కారణంగా రెండో విడతలో రక్తహీనత కేసులు జిల్లాలో గణనీయంగా తగ్గాయి. 2023 జులైలో రెండో విడతను జిల్లాలో ప్రారంభించారు. ఏపీ ఏఎన్‌ఎం హెల్త్ యాప్‌లో అడోలెసెంట్ స్క్రీనింగ్ టైల్‌లో వివరాలు చూసుకుని వెళ్లి విద్యార్థినులను పరిశీలించారు. ఈ మేరకు నిర్వహించిన రక్తపరీక్షల్లో 41.68 శాతం మంది బాలికలకు రక్తహీనత ఉన్నట్లు తేలింది. అంటే మొదటి విడత నిర్వహించిన రక్తపరీక్షల్లో 65.11 శాతం మందికి రక్తహీనత ఉండగా రెండో విడతలో 41.68 శాతానికి తగ్గింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,077 పాఠశాలల్లోని 72,867 మంది బాలికలకు రక్తపరీక్ష చేయగా 18,605 మందికి స్వల్పంగా(హెచ్‌బీ 11 నుంచి 12 శాతం), 11,558 మందికి మధ్యస్థంగా (హెచ్‌బీ 8 నుంచి 11 శాతం), కేవలం 30 మందికి (తీవ్రంగా హెచ్‌బీ 8 శాతం) ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరికి అవసరమైన మాత్రలు నిర్ణీత సమయంలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బాలికలకు అందజేశారు. ఫలితంగా బాలికల్లో రక్తహీనత శాతం తగ్గుముఖం పట్టింది.

కౌమార దశలోనే సమస్య

బాల్య దశ నుంచి కౌమారదశలోకి వచ్చే పిల్లల్లో ఆకస్మిక పెరుగుదల కారణంగా ఐరన్ లోపం/రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉంది. యుక్తవయస్సులోని బాలికలు కూడా వారి రుతుక్రమం కారణంగా రక్తహీనతకు గురవుతారు. ఐరన్ తక్కువగా ఉండే ఆహారం రక్తహీనతకు కారణం అవుతుంది. వీరికి వీక్లీ ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ సప్లిమెంటేషన్ ద్వారా మాత్రలను అందజేస్తున్నారు. రోజుకు రెండు మాత్రల చొప్పున మూడు నెలల పాటు మింగించి చూస్తారు. అనంతరం మళ్లీ పరీక్ష చేస్తారు. అయినా రక్తహీనత సమస్య తగ్గకపోతే సమస్య ఎందుకు వస్తుందో గుర్తించి ఆసుపత్రికి రెఫర్ చేసి, ఆ మేరకు వైద్యులచే చికిత్స చేయిస్తారు.

రక్తహీనతకు కారణాలు

పోషకాహారలోపం, కొన్ని రకాల కిడ్నీ వ్యాధులు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు, మందుల వాడకం, వంశపారంపర్యంగా వచ్చే తలసీమియా, సికిల్‌సెల్ వ్యాధులు, బోన్‌మ్యారోలో సమస్యలు, పీరియడ్స్ సమయంలో రక్తస్రావం అధికం కావడం.

లక్షణాలు

తీవ్రమైన అలసట, నీరసం, కళ్లు తిరగడం, చర్మం పాలిపోవడం, బీపీ తక్కువగా కావడం, గుండె దడ, ఛాతిలో నొప్పి, ఆయాసం, గుండెవాపు రావడం, కాలేయం, ప్లీహంలో వాపు రావడం, మలంలో రక్తం పడటం, నిద్రలేమి వంటి లక్షణాలు ఉంటాయి.



బాలికకు ఐరన్ ఫోలిక్ మాత్ర మింగిస్తున్న వైద్యసిబ్బంది

బాలికలందరికీ రక్తపరీక్షలు



వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికలందరికీ ఏఎన్‌ఎంలచే హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాము. ఎవ్వరికైతే రక్తం తక్కువగా ఉంటే వారికి మూడు నెలల పాటు ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు అందించాము. మూడు నెలలు మాత్రలు వాడినా రక్తహీనతలో మార్పు రాకపోతే అవసరమైన పరీక్షలు, చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి పంపించి చికిత్స చేయించాము.

–హేమలత, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

30న శ్రీశ్రీ జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో మహా కవి శ్రీశ్రీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి తెలిపారు. ప్రముఖ కవులతో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాహితీ వేత్తలు, కవులు, రచయితలు శ్రీశ్రీ కవితలు, సినీ గేయాలను, శ్రీశ్రీపై రచించిన స్వీయ కవితలను చదివి వినిపించొచ్చని తెలిపారు. కార్యక్రమానికి కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు.